ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబర్ 2025 5 అనంతపురం

హొన్నూరు పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంటలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మొంథా గుబులు



ఉమ్మడి జిల్లాలో తేలికపాటి వర్షాలు
పంటనష్టంపై రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మొంథా తుఫాను గుబులు రేపుతోంది. రాష్ట్రమంతా తుఫాను వణికిస్తుండగా జిల్లాలో పెద్దగా ప్రభావం ఇప్పటి వరకు కనిపించలేదు. అయితే మంగళవారం నుంచి బుధవారం వరకు ప్రభావం ఎక్కువగానే ఉండే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొంది. అందుకు తగ్గట్టు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పర్యవేక్షణ జరుగుతోంది. సోమవారం రాత్రి మాత్రం ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాల్లో వర్షపాతం నమోదయింది. ఉరవకొండలో అత్యధికంగా 80.4 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. గుంతకల్లులో 53.2 మిల్లిమీటర్లు పడింది. రాయదుర్గం 45.4 మిల్లిమీటర్లు, శెట్టూరు 39.2 మిల్లిమీటర్లు, బొమ్మహాల్ 22.4 మిల్లిమీటర్లు, బ్రహ్మసముద్రం 20 మిల్లిమీటర్లు అత్యధికంగా నమోదయింది. తక్కిన ప్రాంతాల్లో తేలికపాటి చిరుజల్లులు పడ్డాయి.

రైతుల్లో గుబులు

ఒకవైపు వర్షాభావం మరోవైపు అధిక వర్షాలు ఈ రెండింటి వలన రైతులకు తీరని నష్టం జరుగుతోంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని పంట పండించి చేతికొచ్చిన సమయంలో 'మొంథా' తుఫాను గుబులు రేపుతోంది. ఒకవైపు రాయదుర్గం ప్రాంతంలో వరి, ఇతర ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలు నూర్పిడి జరుగుతున్నాయి. ఈ సమయంలో వస్తున్న తుఫాను ఏ మేరకు నష్టం చేకూరుస్తుందోనని భయపడుతున్నారు. అసలే వీటికి సరైన గిట్టుబాటు ధరలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు ఈ వర్షాలతో ఆ పంట కూడా దెబ్బతింటే పూర్తిగా నష్టపోయే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన చెందుతుందన్నారు. వేరుశనగ కూడా కాయలు ఏర్పడి ఉన్నాయి. అధిక వర్షాలొస్తే వాటిపైనా ప్రభావం ఉండే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

నగర శివార్లలోనూ ఆందోళన

గత వారంలో పడిన అధిక వర్షాలకు అనంతపురం నగర శివార్లలోని కాలనీల్లోకి నీరు చేరింది. దీని నుంచి తేరుకోకముందే మొంథా తుఫాను రావడం నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారికి కంటి మీద కునుకు లేకుండా ఉంది. గతంలోనూ అధిక వర్షంతో నగరంలోని అనేక కాలనీలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఆ భయం ఇప్పటికీ లోతట్టు ప్రాంతాలవాసుల్లో ఉంది. ఇటీవల పడిన వర్షాలకు తోడు ఇప్పుడు అధిక వర్షం పడితే నీరు ఇళ్లలోకి ఎక్కడ వస్తుందోనని బిక్కుబిక్కు మంటూ ఉంటున్నారు. అయితే ఇతర జిల్లాలంత ప్రభావం అనంతపై లేదన్నది ఊరటనిచ్చేదిగా ఉంది.

ఇప్పటికే ప్రధాన జలాశయాల్లో నీరు

అక్టోబరు మాసంలో పడుతున్న వర్షాలకు జలాశయాల్లోకి నీరు వచ్చి చేరుతోంది. గుమ్మగట్ట మండలంలో భైరవానితిప్ప ప్రాజెక్టులో నీరు ఎగువ భాగంలోనున్న కర్నాటక నుంచి నీరు ఎక్కువగా రావడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఇంకోవైపు పిఎబిఆర్ డ్యామ్‌లో గేట్లు కూడా ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. మిడ్‌పెన్నార్ డ్యామ్ ఇంకా నిండాల్సి ఉంది. రెండున్నర టిఎంసిల వరకు నీరు ఈ డ్యామ్‌లో రావాల్సి ఉంది.

భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి నీరు విడుదల దృశ్యం

పిఎబిఆర్‌లో నీటి నిల్వ

కట్టెలపొయ్యి కష్టాలు తీరేదెన్నడో..!
మధ్యాహ్న భోజన కార్మికుల తిప్పలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కట్టెల పొయ్యిలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగతో ఓవైపు.. కట్టెలు దొరక్క మరోవైపు నానాతిప్పలు పడుతున్నారు. మండల కేంద్రంతోపాటు పొన్నూరు, గోవిందవాడ, శ్రీధర్‌ఘట్ట, బొమ్మనహాల్, కల్లుహోళ, దేవగిరి, చంద్రగిరి, లింగదహాల్, గోనేహాల్, నేమకల్లు, ఉద్దేహాల్, తదితర జిల్లా పరిషత్ హైస్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఆయా పాఠశాలల్లో 300 నుంచి 500 మంది దాకా విద్యార్థులు విద్యాభ్యాసం పొందుతున్నారు. వారందరికీ మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిపై తయారు చేయడం నిర్వాహకులకు కష్టంగా మారింది. ప్రభుత్వం మాత్రం గ్యాస్ సిలిండర్లు, పొయ్యిలు సరఫరా చేస్తామని చెబుతోంది తప్ప.. ఆచరణలో మాత్రం శూన్యమని నిర్వాహకులు అంటున్నారు. గ్యాస్‌పొయ్యిలు లేకపోవడంతో కట్టెల పొయ్యిలో వంట చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టెల పొయ్యిల కారణంగా అనారోగ్య బారిన కూడా పడుతున్నామని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ సిలిండర్లు, పొయ్యిలు సరఫరా చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..
చిన్నపాటి వానకే బురదమయంగా దారులు
రాయదుర్గంలో పరిస్థితి

ప్రజాశక్తి-రాయదుర్గం

చిన్నపాటి చినుకు పడినా పట్టణంలోని రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. వర్షం కురిస్తే చాలు వీధులు, రోడ్లు వర్షం నీటితో గుంతలు నిండి బురదమయంగా తయారై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ప్రస్తుతం వారంరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలో అనేక చోట్ల వీధులు జలమయమయ్యాయి. ముఖ్యంగా మట్టి రోడ్లు కావడంతో బురద ఏర్పడి కాలు పెట్టలేని పరిస్థితి. పల్లపు ప్రాంతమైన మధు టాకీస్, దుగ్గిలమ్మ గుడి వీధి, సెయింట్ పాల్ స్కూల్, మున్సిపల్ పార్క్, భంభం స్వామి ఆశ్రమం రోడ్డు, సిద్దేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, అయ్యప్ప స్వామి గుడి రోడ్డు, గ్యాస్ గోడౌన్ ఏరియా, తదితర ప్రాంతాల్లో నీరు నిలిచి బురద ఏర్పడి ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. సెయింట్ పాల్ స్కూల్, షాదీమహల్, మున్సిపల్ పార్క్, పోస్టాఫీస్ ప్రాంతాల్లో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వర్షం నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా, బురద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బురదగా మారిన మధు టాకీస్ ఏరియా రోడ్డు

ప్రజల భద్రత మా కర్తవ్యం : ఎస్పీ

ప్రజాశక్తి అనంతపురం

ప్రజల భద్రతతోపాటు మాన, ప్రాణాలను కాపాడటం పోలీసుల కర్తవ్యమని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీతోపాటు సుమారు 200 మంది రక్తదానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, రక్షణలతో పాటు ప్రాణాలను నిలబెట్టడం మా కర్తవ్యమన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ కల్పించడమేనన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో రక్తం పాత్ర కీలకం అవుతుందన్నారు. అలాంటి ఆపద సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం అదృష్టంగా భావించాలన్నారు. అనంతరం సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్‌యాదవ్, ఆర్‌ఐలు పవన్‌కుమార్, మధు, ఎస్ఐ రుష్యేంద్రబాబు, ఆర్ఎస్ఐ మగ్బుల్, తదితరులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సిఐలు వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్ , ఆర్‌ఐలు పవన్‌కుమార్, మధు, పోలీస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐలు బాబ్జాన్, మగ్బుల్, రమేష్‌నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మినారాయణ, శివకుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రక్తదానం చేస్తున్న ఎస్పీ పి.జగదీష్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పి.జగదీష్ సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యం లో ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణ స్పందన, సహాయక చర్యలు కోసం జిల్లా యంత్రాంగంతో కలిసి జిల్లా పోలీస్ శాఖ పూర్తిస్థాయి సంసిద్ధంగా ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు, కంట్రోల్ రూమ్ 24 గంటల విధానంలో పనిచేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

జాతీయ పోటీలకు బ్రహ్మసముద్రం విద్యార్థిని

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శకుంతల జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు పిఇటి ఇబ్రహీం, ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థి శకుంతలను మంగళవారం ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని తిప్పయ్యదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల బాలరాజు, లింగమ్మ దంపతుల ఏకైక కుమార్తె శకుంతల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిసి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. దీంతో మండలంలోని పలువురు ప్రజలు, అధికారులు, ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపికైన శకుంతల

పత్తికి పురుగు బెడద
ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-శింగనమల

పత్తి పంట సాగు చేసిన రైతులు పురుగు బెడదతో భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి పంటలో బర్మ, ఎర్ర పురుగు విజృంభిస్తోంది. పత్తి పంట మొదటి దశ కోతకు వచ్చింది. ఈనేపథ్యంలో వారంరోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు ఈదురు గాలులు, వాతావరణం మేఘావృతం అవుతున్న విషయం తెలిసిందే. దీంతో పత్తిలో బర్మ, పచ్చ పురుగు, పచ్చదోమ, జీడ పురుగులు వంటికి ఆశిస్తున్నాయి. వీటి నివారణకు పలు రసాయన మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని అన్నదాతలు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 486 హెక్టార్లల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఒక్కో ఎకరాలో పత్తి పంటను సాగు చేయాలంటే సుమారు రూ.30వేలదాకా ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. పంట చేతికి వచ్చిందనుకున్న సమయంలో ఒక్కసారిగా వర్షాలకు పంటలు దెబ్బతినడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని మదనపడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పత్తి పంటను ఆశించే పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తెగులు సోకిన పత్తిపంట

సమస్యల పరిష్కారానికి కృషి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న శాసనసభ కమిటీ బృందం

ప్రజాశక్తి - అనంతపురం

రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల శాసన కమిటీ కృషి చేస్తుందని కమిటీ అధ్యక్షులు కుమార రాజా తెలిపారు. మంగళవారం ఉదయం అనంతపురం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో షెడ్యూల్ కులాలకు చెందిన సంఘాల నాయకులు, ప్రజల నుండి వివిధ ఫిర్యాదులను కమిటీ బృందం స్వీకరించింది. కమిటీ చైర్మన్ కుమార రాజా తో పాటు సభ్యులు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ , శాసనసభ్యులు ఎంఎస్. రాజు, బోనెల విజయచంద్ర, రోషన్ కుమార్ తదితరులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎస్సీ వర్గాల నుంచి వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా శాసనసభ కమిటీ బృందం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా వచ్చిన సమస్యలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాప్తాడునియోజకవర్గం ఆత్మకూరు మండలంలోని మదిగుబ్బ గ్రామ నివాసి పద్మావతి అనే ఎస్సీ మహిళ కు సంబంధించి సర్వే నంబర్ 163/8 లో 47 సెంట్ల భూమిని ఇతరులు దౌర్జన్యంగా కబ్జాచేసుకున్నారని రీసర్వేలో తన పేరును అధికారులు తొలగించినందున తనకు న్యాయం చేయాలని కమిటీకి ఫిర్యాదు చేసింది. జిల్లాలో దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులపై నమోదు అయిన కేసులపై సకాలంలో విచారణ పూర్తిచేయాలని ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధకచట్టం జిల్లావ్యాప్తంగా సక్రమంగా అమలు చేయాలని వివిధ సంఘాలకు చెందిన నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఎస్సీ ఎస్టీ ప్రజలకు సంబంధించిన భూకబ్జాల సమస్యలు పరిష్కరించాలని నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలను ఆధునికంగా అన్ని సౌకర్యాలతో నిర్మించాలని భూమిలోని ఇండ్ల స్థలాలు లేని ఎస్సీ ప్రజలకు ప్రభుత్వం వాటిని మంజూరు చేయాలని వివిధ సంఘాల నాయకులు అర్జీని సమర్పించారు. అంతకుముందు అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అనంతపురం ఆర్‌డిఒ కేశవ నాయుడు పలువురు నాయకులు కమిటీ బృందానికి పుష్పగుచ్చాలను, మొక్కలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి : విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా స్పష్టం చేశారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో మంగళవారం షెడ్యుల్డ్ కులాల సంక్షేమము కొరకు ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ లతో కలిసి ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ అధ్యక్షులుతో పాటుకమిటీ సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్, ఎమ్మెస్ రాజు, విజయ్ కుమార్ బి.ఎన్, రోషన్ కుమార్ సొంగ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే అనంతపురం జిల్లాలో పర్యటించి షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు మరియు షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఇచ్చే వినతి పత్రాలు స్వీకరించడం జరిగిందని, వాటిని మినిట్స్ రూపంలో రికార్డ్ చేసి శాసనసభకు అందజేస్తామని వివరించారు. సంక్షేమ పథకాల అమలు, పెండింగ్లో ఉన్న అట్రాసిటీ కేసుల స్థితి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ స్థితి తదితర అంశాలపై నివేదికలను అందించడం జరుగుతుందన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం 20,000 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, వారి కోసం ఎస్సీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎస్సీ కమ్యూనిటీకి శ్మశాన వాటికలకు అవసరమైన స్థలం, రహదారి ఏర్పాటు, ప్రహరీ ఏర్పాటు విషయమై క్షేత్రస్థాయి నుంచి ఆర్డీవోలు, తహశీల్దార్లు ప్రతిపాదనలు పంపించాలన్నారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని, దీని ద్వారా వారు క్షేత్రస్థాయిలో పర్యటించి గౌరవ ప్రదంగా సమస్యలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సీలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఆర్థిక సహాయం, భూమిని ఎంత మందికి ఇచ్చారు, ఆయా శాఖల్లో పరిధిలో కారుణ్య నియామకాల్లో రోస్టర్ పాయింట్లు పాటించడం, తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు, సమావేశానికి సంబంధించిన నివేదికను శాసనసభకు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఏ.మలోల, తాడిపత్రి ఎఎస్‌పి రోహిత్ కుమార్ చౌదరి, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీవోలు వసంతబాబు, కేశవనాయుడు, శ్రీనివాస్, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవికృష్ణ, శ్రీనివాస్, సిపిఒ అశోక్ కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, జిల్లా వ్యవసాయ అధికారు ఉమామహేశ్వరమ్మ, హౌసింగ్ పీడీ శైలజ, డిఇఒ ప్రసాద్ బాబు, డిఎండబ్ల్యూఒ రామ సుబ్బారెడ్డి, హార్టికల్చర్ డీడీ ఉమాదేవి, జడ్పీ సీఈవో శివశంకర్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామునాయక్, ఏఎస్‌డబ్ల్యూఒలు రామ్మోహన్, శ్రీనివాసులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, రాష్ట్ర అసెంబ్లీ అసిస్టెంట్ సెక్రటరీ డా. రమణయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కుష్బు కొఠారి, వివిధ ఎస్సీ ఎస్టీ సంఘాలకు చెందిన ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఫిర్యాదుదారులు తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ కమిటీ సభ్యులు

ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని కాపాడండి
కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

16 ఏళ్ళుగా ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నిందుతులను అరెస్టు చేయలేని పోలీసుల, రెవెన్యూ అధికారుల నుండి చట్టాన్ని కాపాడాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప కోరారు. అనంతపురము జిల్లా పర్యటనకు వచ్చిన ఎస్సీ శాసనసభ కమిటి బృందానికి కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లప్పతో పాటు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి. వెంకటేష్, నగర అధ్యక్షులు అక్కులప్ప, రూరల్ మండల అధ్యక్షులు జీవరత్నం, నాగేంద్రరాజేష్, రాజా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ గార్లదిన్నె పోలీసు స్టేషన్ లో 2009 నుండి వాన్ బెయిల్ వారెంట్ పెండింగ్‌లో పెట్టి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా అధికారుల నుండి చట్టాన్ని రక్షించాలని కోరారు. జిల్లా లో ఉన్న ప్రతి దళిత వాడలకు 2 ఎకరాల భూమిని శ్మశానవాటికకు కేటాయించాలన్నారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో సర్వే నెం 539-2,540-2లో ఉన్న 0.71 ఎకరాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్మారక భవన నిర్మాణానికి రూ.6 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని, ఉరుములు కళాకారులకు పెన్షన్ మంజూరు చేయాలని, మాదిగ, మాల కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్జీదారునికి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శ్మశానంలో వృత్తిని నిర్వహించే కాటి కాపరులను వృత్తిదారులుగా గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కౌలు రైతులపై నిర్లక్ష్యం తగదు

ఎపి కౌలు రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు



వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలోని కౌలు రైతులకు కష్టాలు ఎక్కువయ్యాయని ఎపి కౌలు రైతుసంఘం ఉరవకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశులు విమర్శించారు. మంగళవారం విడపనకల్లు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపి కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల భూములను సాగు చేసుకుంటున్న కౌలు రైతులందరికీ సిసిఆర్సి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులను గుర్తించి పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ మొత్తాన్ని అందజేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, కౌలు రైతులు సాగుచేసిన భూములకు సంబంధించి ఈ క్రాఫ్ నమోదు కచ్చితంగా నమోదు చేసి ముంత తుఫాను వలన నష్టపోయిన కౌలు రైతులందరిని ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఇకపోతే పంటలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు సిపిఐ నియోజకవర్గ నాయకులు చెన్నరాయుడు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుసంఘం నాయకులు మోపిడి ప్రసాద్, రామాంజనేయులు, విజయ్, హుస్సేన్, రెహమాన్, శివమ్మ, తిప్పయ్య, రాధమ్మ, ఆంజనేయులు, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి

బీడీ, సిగార్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీడీ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పట్టణంలోని అర్హులైన బీడీ కార్మికులకు స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని బీడీ అండ్ సిగార్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బీడీ, సిగార్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రితోపాటు పరిసర గ్రామాల్లో అనేక కుటుంబాలు బీడీలు చుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాయన్నారు. వారందరికీ బీడీ కార్మికుల సంక్షేమ చట్టం అమలు కావడం లేదన్నారు. బీడీ కార్మికులకు సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని ఇప్పటికే అనేకమార్లు మండలం నుంచి జిల్లా స్థాయి అధికారు వినతిపత్రాలు అందజేశామన్నారు. అయినా స్పందించిన పాపానపోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీడీ కార్మికులపై నిర్లక్ష్యం వీడి అర్హులకు స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నరసింహారెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి హనుమంతురెడ్డి, కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి రామ్మోహన్, బీడీ కార్మిక సంఘం నాయకులు హఫీజ్, రహీంబీ, హుస్సేన్‌బి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే రైతుల సమస్యలు పరిష్కారం

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్

మహాసభలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

పోరాటాలు చేయడం ద్వారానే రైతుల సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉరవకొండలోని గవిమఠం సంస్థానం ప్రాంగణంలో మండల రైతుసంఘం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు మారినా రైతుల సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదన్నారు. ఈసమయంలో సుదీర్ఘమైన పోరాటాలు చేసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అనంతరం నూతన నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. రైతుసంఘం గౌరవాధ్యక్షులుగా బి.జ్ఞానమూర్తి, అధ్యక్షులుగా సిద్ధప్ప, కార్యదర్శిగా జి.సీనప్ప, కమిటీ సభ్యులుగా గోవిందప్ప, శ్రీరాములు, వీరాంజనేయులు, రామాంజనేయులు, మహబూబ్, మురళి, రవికుమార్‌ని ఎన్నిక చేశారు.

సమస్యలపై శాసనసభ కమిటీకి వినతి

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లా పర్యటనకు వచ్చిన ఎపి శాసనసభా పక్ష కమిటీకి జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన ప్రభుత్వ జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎంఎండి ఇమామ్, న్యాయవాది శివకుమార్ కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో సంక్షేమ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, వాటి నిధులు, సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు, ప్రభుత్వ సేవల్లో రిజర్వేషన్ల అమలు, షెడ్యూల్ కులాలకు చెందిన ఇతర అంశాలను వివరించి విన్నవించారు. ఆయా విషయాలపై ఎపి శాసన సభ పక్ష కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల, సభ్యులు సానుకూలంగా స్పందిస్తు త్వరలో సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు.

CHANGE OF NAME & FATHER'S NAME

PENAKALPATI MARUTHI (old Name) son of PENAKALAPATI RAMANJANEYULU R/o, 5-102, UDDEHAL village of Bommanahal (M) Rayadurg-515865, Ananthapur District of Andhra Pradesh. I changed my New name PENAKALAPATI MARUTHI PRASAD, S/o PENAKALAPATI RAMANJINEYULU (New name) Henceforth I will be known as PENAKALAPATI MARUTHI PRASAD

CORRECTION OF NAME

MECHIRI SREENIVASULU (old Name) son of MECHIRI CHANNA MALLAPPA R/o 15-1-36/3-4, chowdamma temple street Rayadurg-515865, Ananthapur District of Andhra Pradesh. I correction of my name MECHIRI SRINIVASULU (New name) . Henceforth I will known as , MECHIRI SRINIVASULU.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU
E.P. No.40/2025 in O.S. No.36/2024
BETWEEN:
Gudipati Deviki Devi
...DECREE HOLDER
AND
Kasireddy Krishna Reddy
...JUDGEMENT DEBTOR
NOTICE TO THE JUDGEMENT-DEBTOR
To,
Kasireddy Krishna Reddy S/o K.Nagi Reddy, Flat No:501, Sri Katta Palace Appartment, Kamala Nagar, Ananthapuramu.
పై E.P లో ప్రతివాది హాజరు నిమిత్తము 06-11-2025వ తేదీన వాయిదా వున్నది. ఆరోజు ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు లేని ఎడల కేసు మీ పరోక్షమున తీర్మానము చేయుబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
అల్లు.నారాయణప్ప,
అడ్వకేట్, అనంతపురం,
సెల్ నెంబరు : 9908616177

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం టౌన్ : పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల అసోసియేషన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, తిప్పేస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పెన్షనర్ల భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగంలో ఉనప్పుడు 30 సంవత్సరాలు ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేర్చి సేవలు అందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కరువు బత్యం ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం దామాషా ప్రకారం కరువు భత్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు కృష్ణయ్యచౌదరి, పాండురంగ, వీరభద్రచౌదరి, హంపన్న, కృష్ణమూర్తి, మాచన్న, ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరివ్వాలి

రైతు సంఘం మండల కమిటీ తీర్మానం

ఎపి రైతు సంఘం తాడిపత్రి మండల కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-తాడిపత్రి

చాగల్లు పెండేకల్లు రిజర్వాయర్ నుంచి కాలువలు ఏర్పాటు చేసి ఆయకట్టు భూములకు సాగునీరు ఇవ్వాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రైతుసంఘం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మూడవ మండల మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా రైతుసంఘం భవిష్యత్తు కర్తవ్యాలు, తాడిపత్రి బ్రాంచు ఆకట్టుకు నీరు విడుదలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్‌కు శనగలు పంపిణీ చేయాలన్నారు. కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని బంగారు రుణాలను రెన్యువల్ చేయాలని, ఇన్సూరెన్స్ ఉచితంగా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా నాగరాజు, కార్యదర్శిగా జి.రాజారామిరెడ్డితోపాటు 20 మంది సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల పరిధిలోని గ్రామాలు రైతులు పాల్గొన్నారు

'అనంత' ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు

కార్మికుల హాజరు శాతం పరిశీలన

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంగళవారం తెల్లవారుజామున అనంతపురంలో నగరంలో చేపట్టిన పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా కోర్టు రోడ్డులోని 2వ సర్కిల్ మస్టర్ కార్యాలయానికి వెళ్లి కార్మికుల హాజరు శాతాన్ని పరిశీలించారు. వందశాతం హాజరు ఉండటంపై నెలరోజుల్లో ఒక్కరు కూడా గైర్హాజరు కాలేదా.. అంటూ అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా 2వ సర్కిల్ పరిధిలో పారిశుధ్య పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడే ఎందుకు ఫిర్యాదులు వస్తున్నాయని ప్రశ్నించారు. రోజూ ఉదయం క్షేత్రస్థాయిలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పారిశుధ్యపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు.

పార్కులను అభివృద్ధి చేస్తాం..

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు 28 పార్కులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం శ్రీనగర్‌కాలనీలోని నీరు ప్రగతి పార్కును పరిశీలించారు. ఇందులో భాగంగా మార్నింగ్ వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌తో కలిసి పార్కు మొత్తం కలియ తిరిగారు. వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలను పరిశీలించారు. కొన్ని పరికరాలు దెబ్బ తినడంతో మార్చాలని అధికారులను ఆదేశించారు. పార్కులు షెడ్లతో పాటు ఇతర సౌకర్యాలు కావాలని విజ్ఞప్తి చేయగా వాటిని త్వరలోనే నిర్మిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.60లక్షలతోనే వాకింగ్ ట్రాక్, బెంచీలు, కాంపౌండ్ వాల్ హైట్ పెంచడం వంటి పనులు చేసినట్లు వివరించారు. నగరంలో 28 పార్కులు ఉన్నాయని.. వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, ఇన్‌ఛార్జి హెల్త్ ఆఫీసర్ నరసింహ, డిఇలు సుభాష్ చంద్రబోస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భూమి సారవంతంపై దృష్టి సారించాలి

'ఎన్‌జి రంగా' విస్తరణ సంచాలకులు శివనారాయణ

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు భూములను సారవంతం చేయడంపై దృష్టి సారిస్తే అధిక దిగుబడులు సాధించడం సులభతరం అవుతందని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు జి.శివనారాయణ సూచించారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రాన్ని గుంటూరు ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు శివనారాయణ మంగళవారం సందర్శిం కెవికె శాస్త్రవేత్తలు చేపట్టిన సాంకేతిక కార్యాచరణ ప్రణాళికలను పరిశీలించారు. తర్వాత గార్లదిన్నె మండలం బూదేడు గ్రామంలో సాగు చేసిన బత్తాయి పొలాన్ని సందర్శించి పొలుసు పురుగు నివారణపై చేపడుతున్న క్షేత్ర పదర్శనను వీక్షించారు. అనంతరం రైతులతో ముఖాముఖి చర్చలు చేపట్టారు. తర్వాత బూదేడు మండల పరిషత్ స్కూల్లో పెరిటి తోట విత్తనాలను అందజేశారు. అక్కడి నుంచి సిరివరం గ్రామంలో చేపట్టిన అపరాలు సామూహిక ప్రదర్శన క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కంది, పెసర రైతులు భూమి సారవంతం చేసుకోవాలన్నారు. విలువ ఆధారత పదార్థాలపై దృష్టి పెట్టి లబ్ధి పొందాలని సూచించారు. సొంత విత్తనంతో పెట్టుబడి ఖర్చు తగించుకుని లాభసాటి వ్యవసాయాన్ని చేపట్టవచ్చున్నారు. అనంతరం చిట్టూరు, వీరన్నపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న అధిక సాంద్రత పద్ధతిలో చేపడుతున్న పత్తి పొలాలను సందర్శించారు. అనంతరం సోధనపల్లి గ్రామాల్లో చిరుసంచుల ద్వారా నిర్వహిస్తున్న వేరుశెనగ, కంది, ఆముదం పంటలను సందర్శించి సలహాలు, సూచనలు అందించారు. అక్కడి నుంచి షెడ్యూల్డ్ ఉప కులాల ప్రణాళికలో భాగంగా దత్తత గ్రామం శింగనమల మండలం రాచేపల్లి రైతులకు కోడిపిల్లలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎస్ఎన్ మల్లీశ్వరి సాధినేని, శాస్త్రవేత్తలు జిటి మాధవి (ఉద్యానవన), కె.మాధవి (గృహవిజ్ఞానం), జి.శశికళ (సస్య ఉత్పత్తి), బికె కిషోర్‌రెడ్డి (సస్య రక్షణ), కె.మాధవి (పశు విజ్ఞానం), బి.చందన (వ్యవసాయ విస్తరణ) రైతులు పాల్గొన్నారు

చురుగ్గా బిటి రోడ్డు పనులు

కుందుర్పి : కుందుర్పి నుంచి కొలిమిపాలెం గ్రామం వరకూ ఆరు కిలోమీటర్లు మేర చేపట్టిన బిటి రోడ్డు పనులు చురుకుగా సాగుతున్నట్లు మండల కన్వీనర్ ధనుంజయ తెలిపారు. ఈమేరకు మంగళవారం రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్ సంస్థ ద్వారా రూ.2కోట్లతో ఆరు కిలోమీటర్ల తిరుమల కన్‌స్ట్రక్షన్ వారు రోడ్డు పనులను వేగవతం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు హనుమంతురాయుడు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

తాడిపత్రి రూరల్ : పోలీస్ అమరవీరుల వారోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బ్లడ్ షుగర్, బిపి, ఈసీజీ, సిబిసి, జనరల్ చెకప్, తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడల్లో పాఠశాల విద్యార్థుల ప్రతిభ

యాడికి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈపోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తాడిపత్రి నియోజకవర్గ పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కాశప్ప, ధనలక్ష్మి, యాడికి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీతారామాంజనేయులు, కోనుప్పలపాడు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పెద్దన్న, నగరూరు జడ్పీహెచ్ఎస్ వై.కుళ్లాయప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డప్పరెడ్డికి నివాళి

అనంతపురం : ఎడిసిసి బ్యాంకు మాజీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డికి మంగళవారం నగరంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నివాళు లర్పించారు. ఇందులో భాగంగా రెడ్డప్పరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈకార్యక్రమంలో బ్యాంకు సిఇఒ సురేఖరాణి, డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవ బాబు, విజయ చంద్రారెడ్డి, సీనియర్ అధికారులు, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భైరవానితిప్ప జలాశయం నుంచి కిందికి పరుగులు తీస్తున్న నీరు

బిటిపి నుంచి 4,380 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవాణితిప్ప ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి మంగళవారం నాలుగు గేట్ల ద్వారా 4,380 క్యూసెక్కుల నీటిని వేదవతి నదిలోకి విడుదల చేసినట్లు జల వనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరీష్ తెలిపారు. రిజర్వాయర్‌లోకి 4,100 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా రెండు గేట్లు ఒకటిన్నర అడుగు మేరకు, మరో రెండు గేట్లు ఒక అడుగు మేరకు ఎత్తినీటిని దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 1,655 అడుగులు కాగా ప్రస్తుతం 1653.35 అడుగులకు చేరి నీటి నిల్వ 1.747 టిఎంసిలు ఉన్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే అమిలినేని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

గ్రామాల అభివృద్ధికి తప్పకుండా తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఫాక్షన్‌కు మారుపేరైన నాగిరెడ్డిపల్లిలో కక్షలు, కార్పణ్యాలు మరచి అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. కలిసిమెలిసి ఉంటే సుఖంతోపాటు అభివృద్ధి జరుగుతుందని సూచించారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన శకుంతలను ఎమ్మెల్యే సత్కరించి నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, సర్పంచు సందీప్, జడ్పిటిసి ప్రభావతమ్మ, మండల మాజీ కన్వీనర్ వెంకటేశులు, తాలూకా సమన్వయకర్త చిత్తప్ప, ఎడిసిసి బ్యాంకు డైరెక్టర్ రామాంజనేయులు, ఎంపిటిసి రేణుకమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓబులేసు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు నాగరాజు, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దోచుకుని..దాచుకునేది మీరే.. : టిడిపి

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రజలను దోచుకుని.. దాచుకోవడం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితోపాటు ఆయన సోదరులకే దక్కుతుందని టిడిపి మండల కన్వీనర్ మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాపంపేట పాపం ప్రకాష్‌రెడ్డిదే అని విమర్శించారు. 2019 నుంచి 2024 వరకూ మండలంలో వైసిపి నాయకులు ఎంత అవినీతి చేసారో చిట్టా విప్పుతామన్నారు. వైసిపి కన్వీనర్ బాలపోతన్న ఉపాధి పనుల పేరుతో అక్రమంగా వసూలు చేసింది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లతో కమీషన్లు వసూలు చేసింది మీరు కాదా అన్నారు. వీటితోపాటు అనేక అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. దమ్ముంటే అవినీతిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో హిందూపురం పార్లమెంట్ ప్రతినిధి శశాంక్‌చౌదరి, పాపంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బూత్ కన్వీనర్ కురుబ ఓబుళపతి, తెలుగు రైతు అధ్యక్షులు అంకే ఆనంద్, పాపంపల్లి కుళ్లాయిరెడ్డి, గాలి నరసింహులు, సోషల్ మీడియా కుళ్లాయినాయక్, తదితరులు పాల్గొన్నారు

వర్షానికి కూలిన ఇల్లు..తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని అరేసముద్రం గ్రామంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇల్లు కూలింది. వివరాల్లోకి వెళ్తే.. అరేసముద్రం గ్రామంలో గొల్ల ప్రకాష్, భార్య, ముగ్గురు పిల్లలు నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో అర్ధరాత్రి 12 గంటల తర్వాత వర్షానికి ఇంట్లోని మొదటి భాగం కూలింది. అయితే ఆ సమయంలో కుటుంబ సభ్యులు అందరూ వెనుక భాగంలో నిద్రిస్తున్నట్లు ప్రకాష్ తెలిపారు. ఇల్లు కూలగానే భయాందోళనతో అప్పుటే పక్కింటికి వెళ్లి పడుకున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం తహశీల్దార్ ప్రకాష్ వద్దకు వెళ్లి ఘటన వివరాలను వెల్లడించి ఆదుకోవాలని వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

పరిహారం చెక్కు అందజేత

చెక్కును అందిస్తున్న తహశీల్దార్ రాము

యల్లనూరు : మండల పరిధిలోని లింగా రెడ్డిపల్లి గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి మంజూరైన పరిహారం చెక్కును మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. లింగారెడ్డిపల్లికి చెందిన రైతు గంగా మహేశ్వర్ అప్పుల బాధతో 2015లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు అప్పట్లో అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయితే పరిహారం మాత్రం మంజూరు కాలేదు. ఈనేపథ్యంలో మృతుడి భార్య శివలక్ష్మమ్మ ఇటీవల తహశీల్దార్ రాము ఎదుట సమస్యలను చెప్పుకుని వాపోయింది. ఇందుకు స్పందించిన తహశీల్దార్ రాము ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ.3.50లక్షల చెక్కు మంజూరయ్యేందుకు సహకరించారు. ఈ సందర్భంగా మంజూరైన చెక్కును శిలక్ష్మమ్మకు అందజేశారు. దీంతో బాధితురాలు తహశీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

అపార్ ఐడిపై అవగాహన

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అపార్ ఐడి క్రియేషన్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అపార్ ఐడిని ఎలా చేయాలో క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.రమేష్‌బాబు, డిజిటల్ ఇండియా కార్పొరేషన్ జోనల్ కోఆర్డినేటర్ రవి పాండే, యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ నుంచి రోహిత్ శర్మ, ఎపిఎస్‌సిహెచ్ఇ నుంచి ఎల్లారెడ్డి, డైరెక్టర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శ్రీరాములనాయక్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కె.రామగోపాల్, ఇంజినీరింగ్ కళాశాల బోధన, ఎగ్జామినేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీల షెల్టర్ ప్రారంభం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్ పత్తికొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హమాలీల హనుమాన్ షెడ్డును టిడిపి నాయకులు మంగళవారం ప్రారంభించారు. హమాలీల సౌకర్యార్థం హనుమాన్ జంక్షన్ హమాలీల సంఘం ఆధ్వర్యంలో షెల్టర్‌ను నిర్మించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వా సుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనాయాదవ్, బి.రమేష్, టిడిపి పట్టణ కార్యదర్శి బి.మారుతీప్రసాద్, నాయకులు ఆర్ఎస్ రాజా, మందల నాగరాజు, పులి ఈశ్వరయ్య, న్యాయవాది సోము, అబ్దుల్, రియాజ్, భీమా పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురము అర్బన్‌కు కేటాయించిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతి పై మంగళవారం స్థానిక కౌన్సిల్ హాలులో సచివాలయ సిబ్బందితో కమిషనర్ బాలస్వామి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణాల స్టేజ్‌లపై ఆరాతీశారు. ప్రతి ఒక్క వార్డ్ ఆమెనిటి కార్యదర్శి ప్రతి ఇంటికీ సంబంధించిన స్టేజి టు స్టేజి పురోగతిలోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఇ రాజశేఖర్, హౌసింగ్ డిఇఇ పి.శ్రీమన్నారాయణ, హౌసింగ్ సహాయక ఇంజినీర్లు శివారెడ్డి, జమీల్‌అహమ్మద్, వార్డ్ అమినిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

శింగనమల : కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపిడిఒ భాస్కర్ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కాలనీలోని ప్రధాన వీధులు, ఇంటి కనెక్షన్లు, పైపులైన్ మార్గాలను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేంత వరకూ పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. పైపులైన్‌లో ఎక్కడైనా లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిప్పయ్య స్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు ఆహ్వానం

పెద్దవడుగూరు : ప్రధానమంత్రి గ్రామీణ 2.0 పథకం కింద నూతన గృహాల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇ నెట్టికంటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్హులైన లబ్దిదారులు మీ పరిధిలోని సచివాలయాల వద్దకు వెళ్లి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు

పశుసంపదను పెంచుకోండి

పెద్దవడుగూరు : గ్రామాల్లోని రైతులు పాడిపశువుల సంపదను పెంపొందించుకోవాలని పెద్దవడుగూరు పశువైద్యశాల వైద్యుడు రమేష్ సూచించారు. మంగళవారం మండలంలోని రామరాజుపల్లిలో ఉచిత పశు వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఎదకు రాని పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత పాడిపరిశ్రమ ఎంతో ముఖ్యమైందన్నారు. పాడిరైతులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పాడిసంపదను పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

బుక్కరాయసముద్రం : రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 280 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా 11 మందికి కంటి లోపాలు ఉన్నట్లు గుర్తించి అద్దాలకు సిఫారసు చేశారు. ఇవ్వాలని రెఫర్ చేశారు. అనంతరం కంటి జబ్బులపై ఆప్తమాలిక్ ఆఫీసర్ వి.హరిప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ ఎస్.పర్వీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బేగం, ఎంఎల్‌హెచ్‌పి అశ్విని, ఎఎన్ఎం నాగలక్ష్మి, ఆదిలక్ష్మి, ఆశాలు శోభ, అంజలి, సరస్వతి, రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

రాప్తాడు : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ పరిధిలో ఉన్న రైతుల పొలాలను రేకులకుంట ఎఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ఎఆర్ఎస్ రాధాకుమారి, రెడ్డిపల్లి ఎఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త భార్గవి మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కంది, వరి, మొక్కజొన్న పొలాలను పరిశీలించి పచ్చ పురుగు, తెగుళ్ల గురించి వివరిస్తూ రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్, మండల వ్యవసాయ అధికారి, ఎఇఒ, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

అనంతపురం : తుఫాన్ సందర్భంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది జిల్లావ్యాప్తంగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇబి దేవి సూచించారు. మంగళవారం జిల్లాలో పని చేస్తున్న ప్రాథమిక, పట్టణ వైద్యాధికారులు, సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తుపాన్ ఉన్నందున అంటువ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మంచినీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయించి ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందించాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది తప్పక సమయపాలన పాటించాలన్నారు. అనంతరం విధులకు సరిగా హాజరు కాని తిమ్మంపల్లి, నాగసముద్రం, బొమ్మనహాల్ వైద్యాధికారులకు మెమోలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌టిఒ జయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్లు జి.నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, కె.సురేందర్‌రెడ్డి, ఎస్ఒ మహమ్మద్ రఫీ, డెమో నాగరాజు, సి.సుబ్రహ్మణ్యం, బలరామ్‌రెడ్డి, సి,వెంకటేష్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అన్యాయం

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేసి పేదలకు అన్యాయం చేయడం తగదని వైసిపి నాయకులు సిబి.మంజునాథరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కె.ఊబిచెర్ల, కరిడికొండ, ఊబిచెర్ల, ధర్మాపురం, బాచుపల్లి గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టామన్నారు. వైసిపి కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపేందుకు చేయూతనివ్వాలని అన్నారు. కోటి సంతకాల సేకరణ పూర్తి చేసి గవర్నర్‌కు సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదనరెడ్డి, వైఎంపిపి నాగేశ్వరమ్మ, సర్పంచి కె.రమేష్‌నాయుడు, నాయకులు జి.గోవర్ధన్‌రెడ్డి, సివి రంగారెడ్డి, బేడల వెంకటరాముడు, ప్రవీణ్‌కుమార్ యాదవ్, వై.సుభాష్‌రెడ్డి, గురుప్రసాద్ యాదవ్, డి.మైనుద్దీన్, రామరంగారెడ్డి, నారాయణస్వామి, డి.షఫీ, వెంకటరామిరెడ్డి, మహాలింగ, అబ్దుల్‌బాషీద్, బాల రంగయ్య, ఖాసీం, ఎం.ప్రసాద్, సూరి, వెంకటేష్, బేడల రమేష్, మల్లికార్జున, కౌన్సిలర్లు వరద, వాల్మీకి శివ, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని పొదరాళ్ల గ్రామంలో మంగళవారం రచ్చబండ, సంతకాల సేకరణ చేపట్టారు. ఈకార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్, మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు అంకే నరేష్, ప్రతాపరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం మండలంలోని భట్టువానిపల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దొడగట్ట నారాయణ,ఎంపీపీ మారుతమ్మ

గుత్తిలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

ఆంజనేయులు, కళ్యాణదుర్గం మండల కన్వీనర్ గోళ్ల సూరి, కంబదూరు మండల కన్వీనర్ కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, ఎంపీపీ భీమేష్, జడ్పిటిసి గుద్దిళ్ళ నాగరాజు, బ్రహ్మసముద్రం, కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ రాజ్ మండల అధ్యక్షులు కేశవ్ గౌడ్, యూత్ వింగ్ అధ్యక్షులు హులికల్లు మల్లికార్జున, వైసిపి యువ నాయకులు నరేష్, వేణు, అనిల్ స్థానిక వైసిపి నాయకులు వెంకటేశులు, మధు, ఆంజనేయులు, నాగేంద్ర, చిన్నంజి ,నాగేంద్ర, వన్నూరుస్వామి, మారెప్ప, చౌడన్న, మల్లి, గొల్ల అంజి, తలారి, పాతన్న, చిన్న, పాతన్న గంగాధర,కార్యకర్తలు పాల్గొన్నారు

వ్యక్తిత్వ వికాసంతో మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మాట్లాడుతున్న బద్దేనాయక్

వ్యక్తిత్వ వికాసంతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని ఇన్నినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ సూచించారు. రెండు రోజులుగా శెట్టూరు మండలంలోని మోడల్ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, కెజిబివి పాఠశాలల్లో ఇన్నినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షణ నిర్వాహకులు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల ఎంఇఒలు శ్రీధర్, వాణీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సేవా శిబిరం

అనంతపురం : జాతీయ సేవా పథకంలో భాగంగా స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆలమూరులో చేపట్టిన జాతీయ సేవా ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది. ఇందులో భాగంగా సర్పంచు జి.సౌమ్య ఆధ్వర్యంలో అక్షరాస్యతపై గ్రామంలో సర్వే చేపట్టారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛ భారత్‌పై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.రవిప్రసాద్, ఎన్ఎస్ఎస్ పిఒలు జి.ఆనందబాబు, టి.సుదర్శన్‌రెడ్డి, వాలంటీర్లు కృతిక, నవిత, గౌతమి, హరిక, నవ్య, షర్మిల, మల్లీశ్వరి, కుష్బిర, ప్రవీణ్, ప్రకాష్, నరేష్, రోహిత్, విష్ణువర్ధన్, మురళి పాల్గొన్నారు.

నా ఒక్క హోటలే కనిపించిందా..?

బాధిత దళిత మహిళ దివ్య ఆవేదన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఆందోళన వ్యక్తం చేస్తున్న దివ్య

'20 ఏళ్లుగా హోటల్ కొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నా.. నీ కొట్టు చుట్టూ అనేకమంది టీకొట్లు ఏర్పాటు చేసుకుని ఉన్నారు.. నా ఒక్కటే కనిపించిందా.. తొలగించేందుకు..' అంటూ బాధిత దళిత మహిళ దివ్య ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం స్థానిక విలేకరులతో బాధితురాలు మాట్లాడుతూ ఆక్రమణల పేరుతో ఆర్డీటీ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న తన హోటల్‌ను మున్సిపాలిటీ, పోలీసులు, ఆర్అండ్‌బి అధికారులు తొలగించడం బాధాకరమన్నారు. నా కొట్టుకు అటువైపు.. ఇటువైపు ఉన్నవన్నీ ఆర్అండ్‌బి స్థలంలోనే ఉన్నాయి.. కానీ తనదొక్కటే ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈదౌర్జన్యం వెనుక ఎవరున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ పోరాటం ఇంతటితో ఆపనని.. తనకు న్యాయం జరిగే వరకూ పోరాడుతానని స్పష్టం చేశారు.

జెఎన్‌టియులో సిఎంఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురం : అనంతపురము జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో మంగళవారం కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ (సిఎఎస్) ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య అధ్యక్షతన వివిధ విభాగాల ఆచార్యులకు ఉద్యోగోన్నతికి వివిధ బోర్డ్ ఆఫ్ సభ్యులు, ఛైర్మన్‌లు, వివిధ అనుభవజ్ఞులైన ఆచార్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలు మెకానికల్ విభాగం ఇఇఇ విభాగం, ఫిజిక్స్ విభాగం ఆచార్యులకు ఇంటర్వ్యూలు సాగాయి.

కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయితీలు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా సొంత ఆదాయ వనరులు ఎలా సమకూర్చుకోవాలనే దానిపై ఎంపిడిఒ మమతాదేవి, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శేషారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుభాన్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్‌నాథ్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ జగన్నాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, పరశురాం, లక్ష్మీదేవి, వరలక్ష్మీ, రాజేశ్వరి, కీర్తన, సాయినాథ్‌రెడ్డి, వెంకటరమణ, గోపాల్‌రెడ్డి, కుళ్లాయప్ప, చంద్రమాధవరెడ్డి, సింధుజాదేవి, సర్పంచులు సుప్రియ, కుళ్లాయిరెడ్డి, రామాంజనేయులు, రాంభూపాల్‌రెడ్డి, నాగలక్ష్మి, వెంకట్ నారాయణమ్మ, శివలక్ష్మి, పెద్దన్న, రమణకుమారి, కుళ్లాయప్ప, రామాంజినమ్మ, మల్లేశ్వరి, రామాంజనేయులు, లక్ష్మీదేవి, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ధనుంజయ, ఇఒఆర్‌డి రంగనాయకుల ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి మరుతమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో స్వయంగా రావాల్సిన ఆర్థిక వనరులను పెంచుకోవాలని సూచించారు. ముందుగా గ్రామాల్లో పంచాయతీలకు వచ్చే ఆదాయ వనరులైన ఇంటి, నీరు, కమర్షియల్ భవనాలు, కర్మాగారాల నుంచి వచ్చే పన్నులపై దృష్టి సారించాలన్నారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు ర్పించారు. కార్యక్రమంలో ఒఎ శంకర్, సర్పంచులు శోభారాణి, నాగరత్న, పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని 21 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ఎంపిడిఒ కరుణసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో 2025-26 సంవత్సరానికి పంచాయతీకి సొంత ఆదాయ వనరులు ఎలా సమకూర్చుకోవాలి, మార్గాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మనోహర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

డి.హీరేహాళ్ : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ దాసానాయక్ ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

పుట్లూరులో శిక్షణ ఇస్తున్న అధికారులు

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, ఇఒఆర్‌డి విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు నరసింహారెడ్డి, మహబూబ్‌పీర్, తిప్పేస్వామి, నాగరాజు, సర్పంచులు బొమ్మన గోపాల్‌రెడ్డి, తరిమెల ఓబులేసు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బొమ్మనహాల్ : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని పొన్నూరు గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప కుటుంబానికి మాజీ సర్పంచు కేశప్ప రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. తిమ్మప్ప ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచు ఆర్థికసాయం అందించినట్లు మృతుని కుమారుడు నాగరాజు తెలిపాడు.

ప్రత్యేక వైద్యశిబిరం

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ కె.రవిశంకర్ ఆధ్వర్యంలో స్థానిక సీబాయిలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, మహిళలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యం విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రత్యూష, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.శ్రావణి, సచివాలయ ఎఎన్ఎం జి.దీప, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఎం.ప్రసాద్, సుశీలమ్మ ఎఎన్ఎం, ప్రజలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

యల్లనూరు : స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

యాడికి : పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని హెడ్ కానిస్టేబుల్ శివగౌడ్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని స్టార్ పారడైజ్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసుసిబ్బంది పవన్‌కుమార్‌రెడ్డి, మహేష్, సూర్యుడు, హైస్కూల్ మేనేజ్‌మెంట్ నాగేంద్ర, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుఫాన్ సహాయ చర్యల్లో విద్యుత్ సిబ్బంది

కళ్యాణదుర్గం టౌన్ : పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం కోతేట గ్రామంలో చేపట్టిన మొంథా తుఫాన్ సహాయ చర్యల్లో కళ్యాణదుర్గానికి చెందిన విద్యుత్ సిబ్బంది, విద్యుత్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ఏఇలు మహేష్, మహబూబ్‌పీరా, కాంట్రాక్టర్ రమేష్‌తో పాటు సుమారు 25 మంది సిబ్బంది తరలివెళ్లి సహాయక చర్యల్లో నిమగ్నమైనట్లు విద్యుత్ అధికారులు వెల్లడించారు.

'మనోబంధు' పత్రికావిష్కరణ

అనంతపురం కార్పొరేషన్ : మానసిక రోగులను గుర్తించి చికిత్స అందించే కార్యక్రమానికి సంబంధించి మనోబంధు ఫౌండేషన్ పత్రికను మంగళవారం స్థానిక కౌన్సిల్ హాల్లో కమిషనర్ బాలస్వామి ఆవిష్కరించారు. మానసిక వ్యాధిగ్రస్తుల ఆచూకీ లభిస్తే సెల్..94409 31839 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ రాజశేఖర్, డిప్యూటీ కమిషనర్ పావని, మనోబంధు సంస్థ నాగేంద్ర, తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

వేదావతి నది వద్ద భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

భైరవానితిప్ప ప్రాజెక్టు నిండటంతో గేట్లు ఎత్తిన నేపథ్యంలో మండలంలోని కల్లుదేవనహళ్లి గ్రామ సమీపంలో వేదవతి నది ఒడ్డున అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మునివేలు ఆదేశాలతో విఆర్ఒ శృతి, విఆర్ఎలు కలిసి నీటి ప్రవాహం, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరో బాలకృష్ణ, విఆర్ఎలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని గుండ్లపల్లి వేదావతి నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బి.అనిల్‌కుమార్ సూచించారు. భైరవానితిప్ప ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మంగళవారం మండల పరిధిలోని గుండ్లపల్లి వేదావతి నది పరీవాహక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, ఎఎస్ఐ రామదాస్, విఆర్ఓ రమేష్ పాల్గొన్నారు.